క్లుప్తంగా

వలంటీర్లు సమర్థవంతంగా పనిచేయాలి



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): వలంటీర్లు సమర్థవంతంగా పనిచేయాలని సర్పంచ్ జక్కులూరి రాంబాబు తెలిపారు. గ్రామంలో వలంటీర్లుగా ఎంపికైన బండి బాలకుమారి, జక్కులూరి గోపాలస్వామికి సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నియామక పత్రాలు అందజేశారు. అర్హులందరికీ పథకాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

50 మందికి కంటి వైద్యపరీక్షలు



కన్నెవీడు(వత్సవాయి): వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా సోమవారం గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించారు. సచివాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 32 మందికి కళ్లజోళ్లు, ముగ్గురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుష్మాప్రియదర్శిని, హెల్త్ సూపర్‌వైజర్ జవహర్, ఏఎన్ఎం జానమ్మ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



కొణకంచి(పెనుగంచిప్రోలు): ప్రతి ఒక్కరూ వేసవిలో జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి కె.వాణి తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు అందజేశారు. వేసవిలో ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు తగినంత నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



వత్సవాయి: అంతర్జాతీయ యూత్ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి సోమవారం ఆర్థిక భరోసాను అందించారు. ఏప్రిల్ 10న నేపాల్‌లో జరగనున్న పోటీలకు మండల కేంద్రం వత్సవాయి గ్రామానికి చెందిన చంద్రగిరి గోపాలకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నేపాల్ వెళ్లి వచ్చేందుకు అవసరమైన ఆర్థిక భరోసాను వైఎస్సార్ సీపీ నాయకుడు మార్నెళ్ల పుల్లారెడ్డి తనవంతు సాయం అందిస్తానని గోపాలకృష్ణకు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాదెల రామారావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుత్తా శంకరరావు, ఉప సర్పంచ్ చింతల ఏడుకొండలు, బత్తుల జానకిరాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



మంగొల్లు(వత్సవాయి): ఖమ్మంకు చెందిన సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ పాఠశాలలోని తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. సర్పంచ్ అన్నెపాక ప్రణీత చేతులమీదుగా మొత్తం 51 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగారావు, ఉపాధ్యాయురాలు దయామణి, గ్రామస్తులు అన్నెపాక నరసింహారావు, గోసు రారాజు పాల్గొన్నారు.

మునేరులో వ్యర్థాల తొలగింపు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాల అనంతరం సోమవారం మునేరులో వ్యర్థాలను, చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. అదేవిధంగా గ్రామంలోని వీధులను శుభ్రం చేయటంతో పాటు బ్లీచింగ్ తదితర పనులను సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ పర్యవేక్షించారు.

పట్టణంలో తప్పని పార్కింగ్ ఇక్కట్లు

- షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో లేని పార్కింగ్ సదుపాయం
- రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత



పట్టణంలోని మెయిన్ రోడ్డులో పరిస్థితి

నందిగామ: లక్షలు, కోట్ల రూపాయలు వెచ్చించి కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించే వారు పార్కింగ్ సదుపాయం కల్పించే విషయాన్ని విస్మరించడం నందిగామ పట్టణ ప్రజల పాలిట శాపంగా మారింది. నందిగామ ప్రధాన వ్యాపార కూడలి కావటంతో ఇటీవల ఇరుకు సందుల్లో సైతం కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. అయితే, వీటికి పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల ఆయా కాంప్లెక్స్‌లకు వస్తున్న వారు నిలుపుతున్న వాహనాల వల్ల ఆ దారి వెంబడి ప్రయాణిస్తున్న వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పెరిగిన కమర్షియల్ భవనాల నిర్మాణం

నందిగామ పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పట్టణంలోని సీఎం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఇదే తరహాలో పలు ప్రధాన రహదారులు కూడా అభివృద్ధి చెందనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఇటీవల కమర్షియల్ భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. వాస్తవానికి కమర్షియల్ భవనం నిర్మించినప్పుడు తప్పనిసరిగా సంబంధిత భవన యజమాని పార్కింగ్ సదుపాయం కల్పించాలి. అయితే నందిగామ పట్టణంలో మాత్రం ఏ ఒక్క నిర్మాణదారుడు కూడా బహుళ అంతస్తుల భవనాల్లో సైతం సరిపడా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం లేదు. ముఖ్యంగా కమర్షియల్ భవనాల నిర్మాణదారులు అడుగు జాగా కూడా వదిలి పెట్టకుండా షాపులు నిర్మిస్తున్నారు. ఆయా షాపుల్లో ఏర్పాటుచేసిన దుకాణాలు, హోటళ్లకు వచ్చేవారు. వారి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీని కారణంగా వాహన చోదకులు అవస్థలు పడవలసి వస్తోంది. ముఖ్యంగా మెయిన్ బజార్, సీఎం రోడ్డుల్లో ఇటీవల కమర్షియల్ భవనాలు అధికంగా నిర్మిస్తున్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో హోటల్స్ లాంటివి పెట్టాలంటే తప్పనిసరిగా పార్కింగ్ సౌకర్యంతో పాటు పలు శాఖల అధికారుల నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. నందిగామలో మాత్రం కనీస పార్కింగ్ సౌకర్యాలు కూడా లేకుండానే హోటల్, రెస్టారెంట్ లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ తరహా సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

శాంపిల్స్ పరీక్షించిన తరువాత వ్యాధి నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: పందుల నుంచి తీసిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించిన తరువాత వ్యాధిని నిర్ధారిస్తామని పశు వ్యాధి నిర్ధారణశాల డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుజని, వీబీఆర్ఐ న్యూరాలజిస్ట్ డాక్టర్ శిరీష అన్నారు. నందిగామ డివిజన్ పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం గ్రామంలో పందులు చనిపోతున్న ప్రాంతాలను పరిశీలించటంతో పాటు పెంపకం దారులతో మాట్లాడి పందులను పోస్టుమార్టమ్ నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పందుల పెంపకం కేంద్రాల్లో నిర్వాహకులు పలు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు ఆహారం, నీరు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. అయితే ఇక్కడ మాత్రం అవి ఎక్కడెక్కడో తిరిగి, ఏది పడితే అది తినటం, తాగటం వలన కొన్ని రకాల వ్యాధులు వస్తాయన్నారు. ముఖ్యంగా పెంపకం దారులకు అవగాహన లేకపోవటం ప్రధాన కారణమన్నారు. ఇది క్లాసికల్ స్వైన్ ఫీవర్ లక్షణాలు లాగా ఉన్నాయన్నారు. ఇబ్రహీంపట్నం, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి మరణాలు సంభవించాయన్నారు. పోస్టుమార్టమ్ నిర్వహించగా నెగిటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. అలాగే కర్నూలు, కాకినాడ, ఏలూరు ప్రాంతాల్లో చనిపోతున్న పందులకు పాజిటివ్ లక్షణాలు ఉన్నాయన్నారు. వైజాగ్‌లో మాత్రం నెగటివ్ లక్షణాలు ఉన్నాయన్నారు. ముందు జాగ్రత్తగా మిగిలిన వాటికి వైరస్ సోకకుండా సీఎస్ఎఫ్ వ్యాక్సిన్ ఇస్తున్నామని చెప్పారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పశువైద్యాధికారి అనిల్, గ్రామ కార్యదర్శి శ్యామ్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పందికి పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో సర్పంచ్ పద్మకుమారి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గండేపల్లి(కంచికచర్ల): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని లేకుంటే ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీలపై చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబు హెచ్చరించారు. మండలంలోని గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో వార్షిక తనిఖీలో భాగంగా పాఠశాలను సోమవారం సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. లక్షల కోట్ల రూపాయల నిధులు ప్రతి ఏటా విద్యకు కేటాయిస్తుందని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం పరిమి రవికుమార్, ఉపాధ్యాయులు జే జ్యోతి, ఎం.రామారావు, లత, విజయపాల్, సీఆర్పీలు ప్రసాద్, రాజు, బడేమియా, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చిట్టిబాబు

జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శిగా జుబేర్

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వక్ఫ్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ పట్టణ యూత్ అధ్యక్షుడు షేక్ జుబేర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో జుబేర్‌ను ఉదయభాను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి, వక్ఫ్ బోర్డు అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శిగా తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే ఉదయభానుకు, అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వక్ఫ్ బోర్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మైనార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ముస్లిం నాయకులు, పార్టీ నాయకుడు తన్నీరు నాగేంద్ర, పండరీనాథ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.



జుబేర్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నాయకులు

విస్తృతంగా పారిశుద్ధ్య పనులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 29వ వార్డులో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మంగు సాయి చైతన్య శర్మ ఆధ్వర్యంలో పలు కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టారు. వార్డులో ఉన్న డ్రెయిన్లు చెత్త వ్యర్థాలతో నిండిపోవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి మురుగు నీరంతా ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమల వృద్ధి చెంది పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికులు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సాయి చైతన్య శర్మకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఆయన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాల మేరకు జేసీబీని పిలిపించి మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పనులు పర్యవేక్షిస్తున్న సాయి చైతన్య శర్మ

ముగిసిన పద్దమ్మ తల్లి తిరునాళ్ల

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శివారు రాఘవాపురం గ్రామంలో ఉన్న శ్రీ సత్తిరెడ్డి సమేత పద్దమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ తిరునాళ్ల మహోత్సవం అంగరంగవైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఆఖరి రోజైన ఆదివారం రాత్రి రెడ్డిగూడెం, రాఘవాపురం కొత్తరెడ్డిగూడెం, రంగాపురం, బూరుగగూడెం, తాడిగూడెం గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కోలాటాలు, సంగీత కచేరీలతో సందడి నెలకొంది. సిడిమాను కార్యక్రమంతో తిరునాళ్ల మహోత్సవం ముగిసింది. రెడ్డిగూడెం ఎస్ఐ డి.ఆనంద్‌కుమార్ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.



గోశాల నిర్వహణకు నగదు విరాళం



నందిగామ: గోవులను సంరక్షించుకోవడం మనందరి బాధ్యతని గోశాల నిర్వాహకుడు వందేమాతరం అశోక్ అన్నారు. పట్టణ శివారు పల్లగిరిగుట్టపై గల గోశాలకు పట్టణానికి చెందిన కోయ రణదేవ్ దంపతులు రూ.51,116 ఆర్థిక సాయాన్ని సోమవారం గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సాంప్రదాయం ప్రకారం గోవు సర్వదేవతా స్వరూపమని, అటువంటి ప్రత్యేకత కలిగిన గోవును సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జంగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి



మల్కాపురం(జగ్గయ్యపేట): దేవాలయాలు ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తాయని తాత్వికులు గెంటేల వెంకటరమణ పేర్కొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయ ఆలయ ప్రతిష్ఠ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పురాతన ఆలయాలు కాపాడుకోవాలన్నారు. ప్రస్తుత జీవన గమనంలో కొంత సమయం ఆధ్యాత్మిక భావనకు కేటాయించాలని చెప్పారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి


జగ్గయ్యపేటఅర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పేట మండలం, బలుసుపాడు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ అమ్మనబోయిన హేమలత భర్త సుందరరావుకు అనారోగ్య కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి(ఎల్ఓసీ) ద్వారా మంజూరైన రూ 3.20 లక్షలను ఎమ్మెల్యే ఉదయభాను లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాశరావు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి ఎల్ఓసీని అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని 13వ వార్డులో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డ్రెయిన్లలో దోమలు అధికంగా ఉండడంతో దోమల మందు పిచికారీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించామని చెప్పారు. ప్రస్తుతం దోమల బెడద ఉన్న నేపథ్యంలో పట్టణంలోని 20 వార్డుల్లో చర్యలు కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

రబీ ముసాయిదా జాబితా ప్రదర్శన

వీరులపాడు: ఈ క్రాప్ రబీ ముసాయిదా జాబితాను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించామని ఏఓ జోగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. రైతులు ముసాయిదాలోని పంట వివరాలు తదితరాలను సరి చూసుకోవాలన్నారు. వివరాలలో తప్పులుంటే రైతు భరోసా కేంద్రంలో ఈ నెల 17వ తేదీలోగా అర్జీ అందించాలని తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

జగ్గయ్యపేట: ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేటలో ఎస్‌జీఎస్ కళాశాల, జేఆర్సీ, అమ్మాజీ, వాగ్దేవి మహిళా కళాశాల, నందిగామలో చైతన్య, ఏపీఎస్ఆర్‌డబ్ల్యూఎస్ (ముప్పాళ్ల), మరియ నివాస్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం రెండు నియోజకవర్గాలలో 6,454 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి ఏడాది విద్యార్థులు 2,740 మంది కాగా రెండో ఏడాది విద్యార్థులు 3,714 మంది ఉన్నారు.

ఉదయం 9 గంటల నుంచి..

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించటంతో పాటు పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్‌లు, వెంటిలేషన్, వెలుతురు, వైద్య సిబ్బంది, మరుగుదొడ్డు వసతులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విజయవాడలోని ప్రాంతీయ పర్యవేక్షణా అధికారి కార్యాలయం నుంచి తాడేపల్లిలోని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేశారు

అరగంట ముందు హాజరు కావాలి

విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి రావాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ఫ్లైయింగ్ స్క్వాడ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్, కలెక్టర్ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారు. పరీక్షా కేంద్రాల్లోని ప్రతి అంశాన్ని సీసీ కెమేరా ద్వారా అధికారులు పర్యవేక్షిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదు.

– పెద్దపూడి రవికుమార్, ప్రాంతీయ పర్యవేక్షణా అధికారి

ప్రజా సమస్యల పరిష్కారానికే ‘స్పందన’

నందిగామ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు 8 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు సైతం స్పందన ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న, మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

స్పందనలో మూడు అర్జీలు..

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి సోమవారం తెలిపారు. బియ్యం కార్డులో మార్పు, భూ సర్వే రిపోర్టు, పట్టాదార్ పాసు పుస్తకం కావాలని అర్జీలు వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ సాయి ప్రియ, పీఆర్ ఏఈ టీవీ రవికుమార్, హౌసింగ్ ఏఈ ఏ నరసింహారావు, ఏపీఓం కే భాస్కరరావు పాల్గొన్నారు.

స్పందనకు ఏడు అర్జీలు..

వీరులపాడు: వీరులపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఆశయ నాయక్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే

కంచికచర్ల: కచ్చితమైన కొలతలు, హద్దులతో పకడ్బందీగా భూములను రీ సర్వే చేసి సర్వే హద్దు రాళ్లను వేయిస్తున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాలలో సోమవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వే చేసిన ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో రైతుల సమక్షంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ మరో రెండు రోజుల్లో సర్వే రాళ్లను పాతుతామని ఆ తర్వాత ప్రభుత్వం ప్రకటించిన తేదీ తర్వాత రాళ్లను పాతుతామన్నారు. రైతులందరూ సర్వే రాళ్ల పాతే సమయంలో తమ సిబ్బందికి సహకరించాలని కోరరాఉ. కార్యక్రమంలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మి, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, రైతులు పాల్గొన్నారు.



పరిటాలలో పనులు పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చౌటపల్లి(వీరులపాడు): ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన అంబోజి దుర్గాప్రసాద్(25) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కంచికచర్ల మండలం కీసర గ్రామంలో పని ముగించుకుని ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని కొందరు రైతులు పంట పొలాలకు నీరు పెడుతూ కర్రలను రోడ్డుపై ఏర్పాటు చేయటంతో చీకటిలో సరిగా కనిపించకపోవటంతో వాటిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య అన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతునికి ఆరు నెలల క్రితమే వివాహమైంది.

ఆటో బోల్తా వ్యక్తికి గాయాలు

మక్కపేట(వత్సవాయి): చిల్లకల్లు వైరా రహదారిపై ఎన్ఎస్పీ కాలువ సమీపంలో ఆటో బోల్తా పడడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. చిల్లకల్లు నుంచి వత్సవాయి వైపు వస్తున్న ఆటో కాలువ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కన పడింది. ఆటోలో ఉన్న ఒక వ్యక్తి గాయాలయ్యాయి.